క్లుప్తంగా

ఆకాశవాణిలో ఆధ్యాత్మిక ప్రసంగం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన చరిత్ర అధ్యాపకులు, ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ ఐఎల్ఎన్.చంద్రశేఖర్‌రావు ప్రతి గురువారం ఆకాశవాణిలో ధార్మిక ప్రసంగాలు చేయనున్నారని ఆకాశవాణి కడప కేంద్రం డైరెక్టర్ చుండూరు మహేష్ తెలిపారు. ప్రతి రోజూ జూజూజూ ఉదయం 7.15 గంటలకు కడప కేంద్రం నుంచి ప్రసారం కానున్న కాంతి రేఖలు కార్యక్రమంలో క్షేత్ర దర్శనం శీర్షికలో భాగంగా ఆయన ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఆయన తన ప్రసంగంలో వైఎస్సార్ కడప జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలోని ప్రముఖ దేవాలయాల ప్రత్యేకతలు, తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు.

మంచి సంప్రదాయాలతోనే సమాజాభివృద్ధి


విజేతలతో పవర్ గ్రిడ్ అధికారులు

కడప ఎడ్యుకేషన్: మంచి సంప్రదాయాల వల్లే సమాజాభివృద్ధి జరుగుతుందని పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హరివెంకటకుమార్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో సికె.దిన్నె మండలం పెద్దకాంపల్లి, జె.కొత్తపల్లి, బోడెద్దెలపల్లి ఉర్దూ హైస్కూలు విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు.. సమాజం ఉత్తమంగా రూపొందాలంటే విద్యార్థులు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సమావేశంలో పవర్ గ్రిడ్ అధికారులు విజయ, రాజశేఖర్, ప్రమోద్, రమేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం రమణయ్య, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైడ్ ఇన్ మ్యాథమ్యాటిక్స్‌కు తమ విద్యార్థులు ఆరుగురు అర్హత సాధించినట్లు కడప శ్రీచైతన్య ఐపీఎల్(బృందావనం) విద్యా సంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత నెలలో నిర్వహించిన గణిత శాస్త్ర ఒలంపియాడ్ పరీక్షలో నవనీత, జ్వలిత, జగన్నాథం, యశస్వి, పునీత్ రెడ్డి, ఎస్ఎండీ.సైఫ్ అర్హత సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను ఏజీఎం రమణయ్య, ఆర్ఐ భాస్కర్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వామి నాయుడు మృతి తీరనిలోటు


స్వామి నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కడప అగ్రికల్చర్: ఏపీఎన్‌జీవీఎఫ్ వైజాగ్ జిల్లా చైర్మెన్ స్వామినాయుడు మృతి తీరని లోటు అని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరేరియన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రాజశేఖర్ అన్నారు. 22వతేదీ విజయవాడలో జరిగే కార్యవర్గ సమావేశానికి వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో స్వామినాయుడు మృతిచెందారన్నారు. ఆయన వెటర్నరీ అసిస్టెంట్ నుంచి వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ స్థాయికి ఎదిగి ఫెడరేషన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అంతకు ముందు స్వామినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, డీడీ రంగస్వామి, ఏడీ నేతాజీ, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిషోర్, బాబాసాయి కిషోర్, ఏపీ జూనియర్ అండ్ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, నాయకులు విద్యాసాగర్, శివలక్ష్మమ్మ, రాణి, లావణ్యలక్ష్మీతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: లైంగిక వేధింపులకు పాల్పడిన వైవీయూ వీసీ కృష్ణారెడ్డిని తొలగించాలని శాంతియుతంగా ఆందోళన చేసిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైవీయూ ప్రిన్సిపాల్ గా పనిచేసిన కృష్ణారెడ్డి యూనివర్సిటీ సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ చేపట్టిన దశల వారి ఆందోళనలో భాగంగా మంగళవారం యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం, అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. కేసులు ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలన్నారు.

శాస్త్రి నగర్‌లో సమస్యల తిష్ట

కడప నగర పరిధిలోని శాస్త్రి నగర్‌లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడిచినా అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు లేవు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యాలు లేక స్థానికులు అవస్థ పడుతున్నారు. కాలనీ ఏర్పడినా.. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- శాస్త్రి నగర్‌లో దుర్భర పరిస్థితులు
- అడుగులు వేయలేనంతగా బురద
- డ్రైనేజీ, విద్యుత్ లైన్లు లేక పడరాని పాట్లు
- అధికారులకు విన్నవించినా ఫలితం లేదు


అధ్వాన స్థితిలో రహదారి

కడప కోటిరెడ్డిసర్కిల్: లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించుకున్నా అంతర్గత దారులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కాలువలు లేక మురుగు నీరు, వర్షపు నీరు ఇళ్ల ముందే నిలుస్తోంది. దోమల బెడద తీవ్రమై స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. కడప నగర పరిధిలోని శాస్త్రినగర్ పరిస్థితి ఇది. ఈ ప్రాంతంలో దాదాపు 200–300 ఇళ్లు ఉండగా.. 2 వేల మందికిపైగా జనం నివాసముంటున్నారు. నగరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో నేటికీ సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వెనుక వైపున కాలనీ ఉంది. ఇక్కడిజనం కొళాయి, ఇంటి, ఆస్తి పన్నులు చెల్లిస్తున్నా తమ ప్రాంతం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. కాలనీలో మురికి కాలువలు, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో వర్షం వస్తే మురికి నీటితో కలిసిన నీరంతా రోజుల తరబడి నిలబడుతోంది. ప్రజలు అడుగు తీసి అడుగు వేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు దారిలో పెద్ద గోతులు ఉండడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ మొత్తం బురదమయమైంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు నుంచి వృద్ధుల వరకు బురదలోనే దిగి వెళ్లాల్సి వస్తోంది. కొందరు జారి కిందపడిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడి పరిస్థితి చూసిన ఆటో వాలాలు అత్యవసర సమయంలోనైనా ఇక్కడికి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలనీ వాసులు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లాలంటే నరకాన్ని చూస్తున్నామని ప్రజలు తెలియజేస్తున్నారు. విద్యుత్తు స్తంభాలు లేని కారణంగా వీధి దీపాలు వేయలేదు. రాత్రయితే చీకట్లు కమ్ముకుని బయటికి రాలేకపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో కనీస సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


రోజుల తరబడి నిలిచిన వర్షపు నీరు

వర్షం వస్తే చిత్తడే



మా కాలనీలో సరైన రహదారులు లేకపోవడంతో వర్షం వస్తే చిత్తడిగా మారుతోంది. బురద చేరడంతో ఆ దారిన నడవాలంటే నరకయాతన పడుతున్నాం. అధికారులు స్పందించి సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర సదుపాయాలు కల్పించాలి.

– నాగసాని నాగయ్య, శాస్త్రినగర్

విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుచేయాలి



శాస్త్రి నగర్‌లో రాత్రిళ్లు బయటికి రావాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఎక్కడా విద్యుత్తు స్తంభాలు లేవు. సుదూరం నుంచి మెయిన్ లైన్ ద్వారా తీగలు లాగి విద్యుత్తు తీసుకోవాల్సి వస్తోంది. గాలి వాన సమయంలో సమస్య తలెత్తుతోంది. మురికి నీరు నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది.

– భారతి, శాస్త్రినగర్

పాఠశాలకు వెళ్లాలంటే కష్టం



వర్షం వచ్చిందంటే రోడ్డుపై నీళ్లు నిలబడి నడవలేని స్థితిలో ఉన్నాం. ముఖ్యంగా ప్రతి రోజూ స్కూలుకు వెళ్లే సమయంలో నీళ్లు నిలబడి ఉండడంతో అనేక మార్లు గుంతల్లో పడ్డాం. మా ప్రాంతానికి సీసీ రోడ్లు వేయాలి. నగర పరిధిలో ఉన్నా ఇబ్బందులు తొలగడం లేదు.

– పి.హనీస్, విద్యార్థి

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్, మత గురువులు, విశ్వాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్/కల్చరల్: రాష్ట్రంలో క్రైస్తవ సమాజం సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి సంక్షేమ పథకాలు అందేలా పాలకులు కృషి చేయాలని ఏపీపీఎఫ్ స్టేట్ అడ్వైస్ బోర్డు మెంబర్ డాక్టర్ వైఎస్. థామస్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, సెక్రటరీ శ్యాముల్‌బాబు కోరారు. కడప నగరంలోని ప్రకాశ్ నగర్ బెతనీయచర్చిలో ఆంధ్ర ప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం క్రైస్తవ నాయకులు, దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి నివేదికను రూపొందించారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం మేరకు తమ మతాన్ని గురించి తెలియజేసుకునే హక్కు క్రైస్తవ సమాజం కలిగి ఉందన్నారు. క్రైస్తవ ప్రార్థన మందిరాలకు ఆర్థికసాయం, జిల్లాలో క్రిస్టియన్ భవన నిర్మాణం, పాస్టర్ల గౌరవ వేతనం పెంపు, పవిత్ర జెరూసలెం యాత్రకు రాయితీ పెంపు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఫెడరేషన్ మండల, నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ పీటర్, ఫెడరేషన్ ట్రెజరర్ సుభాకర్, ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్, బోనం ప్రభుదాసు, కేసీ డేవిడ్, ఎ.కుమార్, సంఘటి జోసెఫ్, దేగల శామ్యూల్, అరుణ్ కుమార్, జ్ఞానానందం, సందీప్ రాజు, జాకోబ్, సుధీర్ కుమార్, డేవిడ్ రాజ్, అమర్, పద్మాకర్ ఐజక్, సురేష్, హెప్సిబా, భారతమ్మ, అమ్ములు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ జట్టు ఎంపిక


అండర్ -14 హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. క్రీడా ఎంపికలను స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపికలను నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ -14, అండర్ -17 బాలబాలికల జట్లను ఎంపిక చేసి క్రీడాకారుల జాబితాను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అండర్ -17 జట్టుకు ఎంపికైన బాలబాలికలు

వ్యక్తి అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరం మోచంపేట రహీబ్ షావలి దర్గా సమీపంలోగల ఖాళీ స్థలంలో మట్కా, జూదమాడుతున్న షేక్ మహమ్మద్ ఖాసింను అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ బి.నాగార్జున తెలిపారు. బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు రూ.14,450 నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రేపు కమలాపురం ప్రభుత్వ కళాశాలల్లో జాబ్ మేళా

కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీనదీఒఉదయం పది గంటలకు పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభి టెక్నాలజీస్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇంటర్న్షి మార్కెటింగ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, అగ్రి డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివి 18–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

వేములలో: వేముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహిస్తున్నారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ తెలిపారు. 19–30 సంవత్సరాల వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు.

కమలాపురంలో :కమలాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, అల్ డిక్సన్ కిరణ్ సర్వీసెస్, అపోలో ఫార్మసీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. 18–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, బి, ఎం, డి ఫార్మసీలు, డిగ్రీ, పీజీలు చదివిన వారు అర్హులన్నారు.

ఉల్లి దిగుబడులలో వేల్పుల రైతు ఆదర్శం

- ఏడు ఎకరాలలో ఉల్లి పంట సాగు
- 1000 క్వింటాళ్ల మేర దిగుబడులు
- సాగులో రూ.28 లక్షల మేర ఆదాయం


ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

వేముల : ఈ ఏడాది ఉల్లి సాగు దిగుబడులలో వేల్పుల గ్రామానికి చెందిన లింగాల మల్లికార్జునరెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడు ఎకరాలలో ఉల్లి సాగు చేశారు. 1000 క్వింటాళ్ల మేర దిగుబడులు అందాయి. కాగా వేల్పుల గ్రామానికి చెందిన రైతు లింగాల మల్లికార్జునరెడ్డి లింగాల మండలంలో ఏఎస్ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగరీత్యా విధులు, మరోవైపు వ్యవసాయంపై ఆసక్తితో అన్ని రకాల పంటలను సాగు చేస్తుంటారు. వేల్పుల గ్రామంలో ఎక్కువ మంది రైతులు ఉల్లి పంటను సాగు చేస్తారు. ఈ రైతు అరటి సాగు పూర్తి కావడంతో ఉల్లి సాగుపై దృష్టి పెట్టాడు. జూన్ నెలలో ఉల్లి పంటను సాగు చేశాడు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు

పంట సాగు చేశాక సస్యరక్షణ చర్యలు ప్రధానంగా చేపట్టారు. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి. పంట కాలం నాలుగు నెలలైనప్పటికి ఈ కాలంలో అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటూ పంటను కాపాడుకున్నాడు. తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తలు మందులు పిచికారి చేయడం, సకాలంలో నీటితడులు ఇవ్వడం, రసాయనిక ఎరువులు వాడకం తదితర చర్యలు తీసుకోవడంతో అధిక దిగుబడులు సాధించాడు. నీటి తడులు ఎక్కువ ఇవ్వడంవల్ల కలుపు ఎక్కువగా ఉంటోంది. నీటితడులు ఇచ్చే సమయానికి పంటలో కలుపు తీయాల్సి ఉంటుంది.

1000 క్వింటాళ్లకుపైనే దిగుబడులు

ఉల్లి సాగులో 1000 క్వింటాళ్ల దిగుబడులు సాధించి మండలంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాడు లింగాల మల్లికార్జునరెడ్డి. ఏడు ఎకరాలలో సాగు చేసిన ఉల్లిలో ఎకరాకు 150 క్వింటాళ్ల మేర దిగుబడులు సాధించాడు. పంట సాగు చేశాక వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతోనే అధిక దిగుబడులు సాధించాడు. మండలంలో అక్కడక్కడ కొంతమంది రైతులు 5 నుంచి 7 ఎకరాలలో ఉల్లి సాగు చేసినప్పటికి ఇంతటి దిగుబడులు అందలేదు.

ఎకరాకు రూ.లక్ష మేర పెట్టుబడి

ఉల్లి సాగులో ఎకరాకు లక్ష రూపాయల మేర పెట్టుబడి పెట్టారు. 7 ఎకరాలకు రూ.7 లక్షల పెట్టుబడులు అయ్యాయి. పంట సాగు మొదలు దిగుబడులు అందే సమయానికి ఈ పెట్టుబడులు అయ్యాయి. సాగులో కలుపు తీయడం, మందులు పిచికారి చేయడం, సత్తువలు, ఉల్లి గడ్డలు పీకి వేయడం, కోయడం తదితర ఖర్చులతో పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నాడు.

సాగులో రూ.28 లక్షల ఆదాయం వచ్చింది

నాకున్న 7 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ఎకరాకు లక్ష రూపాయల చొప్పున పెట్టుబడులు పెట్టాను. మార్కెట్‌లో ఉల్లి ధరలు ఉండటంతో క్వింటా రూ.3500లతో అమ్ముకున్నా. పెట్టుబడులు పోనూ నాకు రూ.28 లక్షల మేర ఆదాయం వచ్చింది.

– లింగాల మల్లికార్జునరెడ్డి, వేల్పుల

బద్వేల్ ఘటనలో నిందితుడిని ఉరితీయాలి


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్‌లో మైనర్ బాలిక ఘటనలో హంతకుడిని ఉరి తీయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులను తగ్గించే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఇటీవల కోల్‌కతాలో డాక్టర్ హత్య ఘటన మరువక మునుపే బద్వేల్‌లో మరో ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనల విషయంలో రాజకీయం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరాజుద్దీన్, శ్యామలమ్మ, కదిరి ప్రసాద్‌గౌడ్, సయ్యద్ సలావుద్దీన్, వెంకటరమణ, సయ్యద్ గౌస్ పీర్, అప్పపోగుల ఎల్లయ్య, సంజయ్‌కాంత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక: ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన న్యాయవాది అబ్బాస్, సీఎస్.పీర, షేక్ నాయబ్ రసూల్, షేక్ నూరుల్లా, షేక్ మస్తాన్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇర్ఫాన్, గోసంగి సుబ్బారెడ్డి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల హక్కుల సంరక్షణకు కదులుదాం

- గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ నేషనల్ చైర్మన్ కాసల కోనయ్య


జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ ఛైర్మెన్ కాసల కోనయ్య

కడప కార్పొరేషన్: పేదల సంరక్షణకు అందరూ కలిసికట్టుగా ఉద్యమిద్దామని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ నేషనల్ ఛైర్మెన్ కాసల కోనయ్య పిలుపునిచ్చారు. కడపలోని ఓ కళ్యాణ మండపంలో బుధవారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా చైర్మెన్ లోకేష్ మాట్లాడుతూ మానవ మనుగడ ప్రశ్నార్థకం కాకూడదని, వారి హక్కులను సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, రాయలసీమ రీజనల్ చైర్మెన్ సురేష్‌బాబు, సుబ్బరామయ్య, రాఘవ, శివప్రసాద్, రామక్రిష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, పాశంరవి, శిల్పారెడ్డి, జాకీర్‌హుస్సేన్, గౌస్, ఇర్షాద్, చెన్నకేశవులు, భాస్కర్ రెడ్డి, షేక్షావలి, సుధాకర్, సుబ్బలక్ష్మి, దయ్యాలరవి, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహనకు కృషి

కడప కల్చరల్: భారత రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కులపై పేద, బడుగు వర్గాలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారు పాస్టర్ పి.మహేష్ అన్నారు. స్థానిక పాత బస్టాండులోని ఓ భవనంలో సంస్థ నిర్వహించిన సమావేశంలో పాస్టర్ మహేష్ మాట్లాడుతూ మానవ హక్కులపై కులమతాలకతీతంగా ఆపదలో ఉన్న వారికి రక్షణ కల్పించలా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా వారిలో ధైర్యం నింపుతామన్నారు. సంస్థ నేషనల్ చైర్మన్ కోనయ్య మాట్లాడుతూ ప్రపంచ మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పి.రవితేజ, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, రాయలసీమ రీజనల్ చైర్మన్ సురేష్‌బాబు, సుబ్బరామయ్య, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల వైపు దృష్టి కేంద్రీకరించాలి


విద్యార్థి నిహంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్‌రెడ్డి, అధ్యాపకులు

- ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనల వైపు దృష్టి కేంద్రీకరించాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో విదర్భ మహా విద్యాలయ, బుల్దన మరియు గ్లోబల్ పౌండేషన్ సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో పలువురు పత్ర సమర్పణ చేయగా.. ప్రభుత్వ పురుషుల కళాశాలకు చెందిన కె.సాయిలీలా మనినిహంత్ ఆరోగ్యకర జీవితాలు, ఆరోగ్యకర సమాజాలు.. వ్యాధుల నియంత్రణ.. అరికట్టే విధానం అంశంపై చేసిన పత్ర సమర్పణకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జంతుశాస్త్రం విభాగంలో చదువుతున్న విద్యార్థి ఈ ఘనత సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్, నాగేంద్ర, మహేష్, అపర్ణ, డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, తదితరులు మని నిహంత్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ఓబుల్‌రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఇమ్రాన్, జాహ్నవిలు ఈనెల 21వ తేదీన కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారు. వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే 8వ తరగతికి చెందిన ఆరిఫ్ అనే విద్యార్థి మొదటి స్టాండ్ బాయ్‌గా నిలిచాడు. వారిని బుధవారం పాఠశాల హెచ్ఎం ఓబుల్‌రెడ్డి, పీడీఎల్ఏ సునీల్‌లు అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అధికారుల సమావేశం


మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : హీట్ అండ్ రన్ కేసులపై డిస్ట్రిక్ట్ లెవల్ అధికారుల మానటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కడప, రాయచోటి డీఎస్పీలు, కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీఓలు, అన్నమయ్య సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓలు పాల్గొన్నారు. బాలల హక్కులు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహ పూర్వక న్యాయ సేవా పథకం–2015 గురించి, తప్పిపోయిన గుర్తించబడని పిల్లల కేసులపై చర్చించారు. జువైనల్ జస్టిస్ చట్టం, న్యాయ సహాయం, రక్షణ సలహా వ్యవస్థ, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబరు 15100 అంశాలపై పోలీసు, రెవెన్యూ అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫకృద్దీన్ వివరించారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని విద్యుత్తు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. కాలనీలో ఉంటున్న రవికుమార్ ఈ నెల 21వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు నగలను అపహరించారు. ఇంటికి తాళాలు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు రవికుమార్కు సమాచారం అందించారు. ఆయన వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్కా బీటర్ల అరెస్టు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. నాగరాజు పేటలో మట్కా నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ అమర్నాథ రెడ్డి దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారన్నారు. వారి నుంచి రూ.20,850 మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.